# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరతులు



## మంగళ హారతి

**స్వామి వెంకయార్యాయ గొలగమూడి వాసాయ-మామకాభీష్టదాయ మహిత మంగళం**

లోకనాథాయ సర్వలోక సంరక్షకాయ - నాగలోక స్తుత్యాయ నవ్యమంగళం ॥**స్వామి**॥

భక్తబృంద వందితాయ బ్రహ్మస్వరూపాయ - ముక్తిమార్గ బోధకాయ పూజ్యమంగళం ॥**స్వామి**॥

సత్యతత్వ బోధకాయ సాధు వేషాయతే -నిత్య మంగళదాయకాయ నిత్య మంగళం ॥**స్వామి**॥

# ముందుమాట
## (శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ముందుమాటతో కలిపి మా మాట)

ఆధ్యాత్మిక జీవితానికి మహాత్ముల నాశ్రయించి తీరాలని సకల వేదాంతసారము. యోగశాస్త్రమైన భగవద్గీతలో భగవంతుడైన శ్రీ కృష్ణుడు చెప్పాడు. అంతేకాదు తానూ, అటువంటి జ్ఞానీ వేరు గాదని కూడా చెప్పాడు.

కానీ ద్వాపరయుగంలోనే కొన్ని వేలమంది మానవులలో ఆత్మజ్ఞానానికై ప్రయత్నమైనా చేసేవాడు ఏ ఒక్కడో వుంటాడని గూడా కృష్ణుడు చెప్పాడు. అటువంటప్పుడు ఈ కలియుగంలో బ్రహ్మజ్ఞాని, భగవంతుడూ అయిన సద్గురువెక్కడ దొరుకుతాడు? అందుకని భగవంతుడే గురువై దత్తాత్రేయుడుగా అవతరించి, ఆయనయే యిటీవల శిరిడీ సాయిబాబాగా, నెల్లూరు జిల్లాలో శ్రీ భగవాన్ వెంకయ్యస్వామిగా అవతరించారు. వీరు మహాసమాధి చెందాక కూడా పూర్వం వలనే భక్తులను కష్టాలలో ఆదుకొనడమేగాక, తమ భౌతికరూపంలో గూడా దర్శనమిస్తున్నారు. శ్రీ సాయినాథుడు, శ్రీ వెంకయ్యస్వామి తమను సులభంగా సేవించుకొనే సాధనాలన్నింటినీ తెల్పారు. ఇవి 3 విధాలు: 1. సమగ్రమైన చరిత్ర పారాయణ 2. సత్సంగము 3. ఆరతులు

శ్రీ శిరిడీ సాయిబాబా తన భక్తుడైన భీష్మతో ఆరతులు వ్రాయించుకుని ఆ ఆరతులను పాడించుకొని ఆనందించారు. అవి కాకుండా ఇంకా కొన్ని ఆరతులను కలిపి 1922లో ఖపర్దే అను భక్తుడు 'శ్రీ సాయి సగుణోపాసన' అను చిన్న గ్రంథమును ముద్రించారు. ఈ రోజు మనము శ్రీ సాయినాథుని మందిరములలో పాడే ఆరతులు అవియే. అయితే శ్రీ భగవాన్ వెంకయ్యస్వామికి కూడా ప్రత్యేకముగా ఆరతులు లేనందువలన శ్రీ సాయి ఆరతులలో 'సాయి'కి బదులుగా 'స్వామి', 'శిరిడీ సాయి'కి బదులుగా 'గొలగమూడి వెంకయ్యస్వామి' అని మార్చి ఆనాడు సాయి విన్న ఆరతులను నేడు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ముందు అందరూ కలిసి సామూహికముగా, రాగయుక్తముగా, భావయుక్తముగా పాడుకుంటే బాగుండునని మా చిన్న ప్రయత్నము. సర్వశాస్త్రముల సారము ఈ ఆరతులలో నిక్షిప్తమై యున్నది. అందువలన సర్వదేవతా స్వరూపుడైన శ్రీ వెంకయ్యస్వామికి 4 వేళలా ఆరతులు పాడి శ్రీ స్వామివారి ఆశీస్సులను పొంది మన జీవితాలను సార్థకం చేసుకుందాం.

సాయి చరిత్రలో ఖపర్దే అను భక్తుడు ఆరతికి ఆలస్యముగా వచ్చాడని మశీదులోనికి రానీయకుండా గేటు దగ్గరనుంచే సాయినాథుడు విభూతి యిచ్చి పంపేశారు. 24 గంటల కాలంలో మన సొంత పనులకు 23గంటలు వాడుకున్నా కనీసం ఒక గంట కాలమైనా 4 ఆరతులకు కలిపి సమర్పించగలుగుతాము.

ఒక భక్తుడు తాను చెప్పుకున్న కాలముకంటే 2 నిమిషాలు ముందుగా వెళ్ళిపోయేవాడు. అలా రెండు రోజులు అయిన తర్వాత శ్రీ వెంకయ్యస్వామి ఆ భక్తునికి స్వప్నములో అగుపించి అతని చొక్కా కాలర్ పట్టుకొని మందిరములోనికి లాక్కొని వచ్చి గడియారం చూపుతున్నారు. ఆ గడియారం ఉదయం 6గం॥ 28ని॥ చూపుతున్నది. తాను నిత్యము మందిరములో ఆరున్నర గంటల వరకు ఉంటానని చెప్పుకున్న దానికంటే రెండు నిమిషాలు తక్కువ వున్నది. నిజానికి అప్పుడు సమయం రాత్రి 12 గంటలు కావొస్తున్నది.

శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాష్టారుగారు తన జీవిత కాలములో ఒక్క నిముషము ఆలస్యము కాకుండా అందరితో ఆరతి చేయించేవారు. ఒక్క నిమిషము కూడా ఆలస్యము చేయకుండా సమయపాలన చేయుట ముఖ్యము. మనకు కొండంత అండ అయిన శ్రీ స్వామివారు కోరినది కాకుండా మిగిలినవి ఎన్ని సమర్పించినా అదంతా మన తృప్తి మాత్రమే అవుతుంది. కాలము భగవంతునికి సమర్పించే గొప్ప సాధనము ఆరతులు. వివేక వైరాగ్యాలను ఉపయోగించి ఆరతులలోని భావాలను ఆచరించే ప్రయత్నం చేస్తే ఆ మహనీయుడు మనము వద్దన్నా అనంత ఆనందాన్ని మనకు అనుగ్రహించడము ఎందరో భక్తుల అనుభవము.

“వాళ్ళుండేదాన్ని బట్టి గదయ్యా మనముండేది” అన్న శ్రీ స్వామివారి మాటలు మన దృష్టిలో ఉండి ఈ ఆరతులు ప్రతి ఒక్కరూ చేసుకున్నట్లయితే వారి అండ ఎప్పుడూ మనకున్నట్లే.

**ఆచార్య ఎక్కిరాల భరద్వాజ,**
20-8-87, ఒంగోలు

## ఓం సాయి
## నా మాట

నేను అనుకోకుండానే 1985 వ సం॥లో శిరిడీ వెళ్ళితిని. విశేషమేమనగా అప్పటివరకు సాయినాథుని గురించి తెలియదు. పరమాత్ముని లీలలు విచిత్రమైనవి కదా! సాయినాథుడు నన్ను తన చెంతకు రప్పించుకొని ఆ ప్రేరణ కలిగించినందుకు, శివనేశన్ స్వామీజీ నన్ను ఆ సమయమున ఆదరించినందుకు, అదే సమయములో శిరిడీలోని ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిని పరిచయము చేయించినందుకు సాయినాథునికి ఆజన్మాంతము ఋణపడి వున్నాను. ముద్రణకై ప్రోత్సహించిన భక్తులను ఆశీర్వదించమని కోరుతూ.

**రచయిత: సాయిదాస్ (యం. కృష్ణ)**

అడ్రస్: దత్తసాయి మందిరం ప్రక్కన,యం.వి. అగ్రహారం,ట్రంకురోడ్డు,
నెల్లూరు-524 001, ఫోన్: సెల్ : 94408 38621

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహారాజ్‌కి జై

# మేలుకొలుపు ఆరతి

**(1)**

1. జోడించి చేతులు పాదములపై - శిరస్సు వంచితిని
వెంకయ్యస్వామి నా మొర వినమని - వేడుకొంటిని
2. భక్తీభావము ఉండీ, లేకయో - నీ దరి చేరితిని
దయతో మమ్ము సద్గురునాథా - చూడమంటిని
3. అనంతమైనా నీ పదసేవను - కోరితినో దేవా
ఆ భావమునే నా హృదయములో - నిలుపుమయా దేవా
4. నీ చరణాలలో కొద్దిగ స్థానము - నీయుమా దేవా
తుకారామ్ అందరికీ - బోధించాడయ్యా

**(2)**

1. పాండురంగా లేవవయ్యా - తెల్లవారెను
వైష్ణ సమూహము గరుడ స్తంభము - చెంతన నిలిచెను
2. గరుడ స్తంభము నుండి - మహా - ద్వారము వరకు
దేవాధి దేవులు దర్శనమునకై - వేచి వున్నారు
3. శుక సనకాదులు నారద తుంబుర - భక్త శిఖామణులు
త్రిశూల ఢమరు ధరించి నిలిచే - గిరిజా శంకరుడు
4. కలియుగమందున నామదేవుడు - నిన్ను కీర్తించే
తదేక దృష్టితో జనాబాయి - నిన్నే స్మరియించే

**(3)**

1. **లే - లెమ్మ శ్రీ వెంకయ్యస్వామి - దర్శనమీయవా**
**దారిద్ర్య రోగ తాపము నుండి - మము కాపాడవా**
2. నిన్ను వదలిన అంధకారము - మా దరి చేరినది
అజ్ఞానులైనా మమ్ములను చేరి - మోహింపచేసినది
3. యోగమాయను వదలించుటకై - శక్తీ లేదయ్యా
మాయ నుండి ముక్తుని చేసి - దర్శనమీయుమయా

4. ఓ - గొలగమూడివాసా - సూర్యదేవునివలే
చీకటిని పోగొట్టి మాకు - దర్శనమీయుమయా
5. ఆదిశేషుడే నీ మహిమలను - వర్ణించలేడయ్యా
ఏ విధంబుగా నీ గుణగానము - చేయుదుమో దేవా ॥**లేలెమ్మ**॥
6. నిర్మలమైన మనస్సుతో భక్తులు - నీ ద్వారము నందు
నిను పూజించి సేవించుటకై - నిలిచి యున్నారు
7. ధ్యానస్థులైన మిమ్ముల చూసి - మనస్సు భ్రమియించే
మీ వచనాలను గ్రోలుటకై - మా మది తపియించె
8. తల్లి పుత్రుని చూసిన విధముగా - నను చూడుము దేవా
దీన బాంధవా - లక్ష్మీరమణా - కరుణించుము దేవా
9. మధుర వాక్కులు తెల్పి మా - తాపము పోగొట్టుము
మా కొరకై మీకు దేవాధిదేవా - పెడితిమి కష్టాలు
10. సహించి మా మొర ఆలకించి - దర్శనమీయవా

**(లే లెమ్మ - దారిద్ర్య)**

**(4)**

1. పాండురంగా నిద్దురలేచి - దర్శనమీయుమా
అరుణోదయము అయినది దేవా - మము గమనించుమా
2. వేచియున్నది సాధుసంతా - భక్త సమూహము
నిద్రా సుఖమును వదలి మంగళ - రూపము చూపుము
3. మహాద్వారములో నిలిచిన మనస్సు - ఉవ్విళ్ళూరెను
మీ దర్శనము చేయవలెనని - మా మది కోరెను
4. అమ్మా - రుక్మిణీ దేవీ - నీవైనా మాపై
కరుణను చూపి - పాండురంగని నిద్దుర లేపుమా
5. స్వర్గదేవతలు మీ నామమునే - జపించుచున్నారు
గరుడా హనుమంతులు మీ - ద్వారములో నిలిచారు
6. మేలుకొలుపు విష్ణుదాసుడు - చేయ నిలిచాడు
తలుపులు తెరిచిన ఆరతిత్తునని - వేచి ఉన్నాడు

**(5)**

1. చేయుదమా పంచారతి - వెంకయ్యస్వామికి ఆరతి
2. లే లెండు బంధువులారా - లేచెను రమానాథుడు
3. స్థిరమైన మనస్సుతో - చేయుదమా ధ్యానము
4. కృష్ణనాథా దత్తస్వామి - మా మదిలో నీవేనోయీ

**(6)**

**మేలుకొలుపు ఆరతినిచ్చిన - గొలగమూడివాసా**
**దివ్య రూపమును చూపుము మాకు - గైకొని సేవా**

1. కామక్రోధముల నా మనస్సును - వత్తిగా చేసీ
వైరాగ్యమనే నేతిలోనా - ఆ వత్తిని తడిపి
స్వామిపై గల గురుభక్తీయను - జ్యోతీ వెలిగించి
ఆ వెలుతురులో ప్రకాశించిన - గురుదేవుల చూచి
ద్వైతము నశించి జీవుడు - తత్స్వరూపి ఆయే దేవా ॥ **దివ్య**॥

2. ఆకాశములో భూమిపైన - నీవే వ్యాపించి
దత్తాత్రేయా స్వామి - గొలగమూడిలో నివసించి
అక్కడ నుండి కష్టాలలో - భక్తులను కాపాడుతూ
సుర నరులకు తెలియరాని - మహిమలు చూపుతు
యోగుల హృదయ కమలములో - నివసించే దేవా ॥ **దివ్య** ॥

3. నీ యశో తేజ దుందుభులు - గగనాన మ్రోగే
గొలగమూడిలో భక్త సమూహము - దర్శనము కోరే
విని నీ వచనామృతములు వారు - భ్రాంతిని కోల్పోయిరి
దురభిమానములను వదులుకొని - దాసోహంబనిరి
దాసులను అనుగ్రహించి - దర్శనమీయవా

॥ **దివ్య** ॥ ॥ **మేలుకొలుపు** ॥

**(7)**

1. మాలో కలిగిన భక్తీ - మేలుకొలుపు జ్యోతి
2. పంచ ప్రాణముల జీవభావమే - స్వామికి ఆరతి

3. మేలుకొలుపు ఆరతి నీకు - పండరినాథా గొలగమూడివాసా
4. చేతులు జోడించి ప్రభుపాదములపై - శిరస్సునుంచెద
5. నీ మహిమలను ఏ విధంబుగా వర్ణించగలను
6. మీ దర్శనముచే బ్రహ్మహత్య - పాపము నశించు
7. రాయీ రఖుమాబాయి ఇద్దరు - చెంతన నిలిచారు
8. మయూర పింఛా చామరములతో - వేచి ఉన్నారు
9. దీపము వెలుగులో తుకారాముడు - నిను కీర్తించాడు
10. ఇటుకరాతిపై పండరినాథుడు శోభించుచున్నాడు

**(8)**

1. లే లెండి ఓ సాధువులారా - హితము తెలుసుకొండి
నశించిపోవును ఈ దేహం - దైవాన్ని తలచుకొండి
2. ఇటుకపై నిలిచిన పరమేశ్వరుని - దివ్యపాదములను
దర్శించి పూజించి ఆనందించుము - స్వర్గ సుఖాలను
3. లేవండి లేవండి తొందరగా - కోవెల కెళ్ళెదము
మేలుకొలుపు ఆరతినిచ్చిన - తొలగును పాపాలు
4. అమ్మా రుక్మిణి పరంధాముని - నిద్దుర లేపమ్మా
దృష్టి తగలని వెన్నను స్వామికి - నైవేద్యమీయమ్మా
5. ఢోలు మరియు భాజంత్రీలు - మ్రోగెను ద్వారమునా
వెంకయ్యస్వామికి ఆరతి జరిగెను - అట్టి సమయమునా
6. శంఖములతో సింహనాదములు - చేయుచున్నారు
నామదేవుడు స్వామి చరణములకు - మ్రొక్కుచున్నాడు

**(9)**

వెంకయ్యస్వామి - నా కన్నతల్లి - మీ చరణాలలో నాకు చోటియ్యి..
దత్తాత్రేయుడే నా కన్నతల్లి - మీ చరణాలలో - నాకు చోటియ్యి

**॥ వెంకయ్యస్వామి ॥**

**శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహరాజ్‌కీ జై**

(10)

1. నీలాల గగనాన భాస్కరుండు - ఉదయించి వెలిగే
ఈ మానవుడిని బంధించలేక - కలిపురుషుడు అలిగే
చేతులు జోడించి చేసేము నీకు - గురుప్రార్థనా
**సమర్థ గురు స్వామినాథ వినుమా - మనోవేదనా**
2. రవి చీకటి పోగొట్టును శ్రీ - గురువజ్ఞానం
గురుదేవులకు ఆ సూర్యదేవుడు - కాదు సమానం
జ్ఞానమెన్నడు నశింపబోదు - చీకటి విధమున ॥ **సమర్థ గురు**॥
3. రవి రాకతో చీకటి మరి - వ్యాధులు పోవును
గురుకృపచే మనలో - దుష్కర్మలు పోవును
త్యజించి అభిమానము గురువుపై - నిలుపు భావన ॥**సమర్థ గురు**॥
4. గురుదేవులకు త్రిమూర్తుల - ఉపమానము వలదు
భక్తకోటిని తరింపవలసిన - మహాపురుషుడు
మనోభీష్టములు సిద్ధించాలని - ఈయుమా దీవెన॥ **సమర్థ గురు**॥
5. సమాధి విడిచి ఓ గురు - మందిరానికి రా
నీ వచనమ్ములు ఎంతో మధురము - ఓ గురుదేవా
మా పాపాలను పోగొట్టి నీవు - చూపుమా కరుణా॥ **సమర్థ గురు**॥
6. ఆహా ఎంతటి మంచి సమయము - శ్రీ గురు లేచెను
కష్టాలన్ని కడతేర్చుచు గురు - భక్తుల బ్రోచెను
ఇంతమంచి గురు ఈ జగమందు-ఈ విధి దొరుకునా ॥ **సమర్థ గురు**॥
7. గురుకృపా లేనిదే జీవితం - కాదు సార్ధకమ్
హితము తెలియక వ్యర్థము - చేయకు జీవితమ్
కోరికలన్ని సిద్ధింపజేయు - గురుకృపా కలిగిన॥ **సమర్థ గురు** ॥
8. నా హృదయ మందిరములో - శ్రీ గురు నిలువుమా
పరోపకారము చేయుటకు - సద్బుద్ధి నీయుమా
ఆలకించుమా ఓ గురుదేవా - విజ్ఞాపనా ॥ **సమర్థ గురు** ॥

(11)

తెల్లవారగనే గురు అష్టకమును - ఎవరైతే పఠించుదురో
భ్రమలన్ని తొలగించుకొని నిత్యము - శాంతి పొందెదరు
వెంకయ్యస్వామి ఈ తత్వమును ఈ బాలకునికి - ఏ విధి నేర్పించెనో
ఆ విధముగా శ్రీ కృష్ణునికి వినయమున - నమస్కరించితిని

(12)

**స్వామి చూపుమా కరుణా నీ పిల్లలను బ్రోవుమా ॥2॥**
అసత్యమైనది ఈ జగమంతా-అంతట నీదే మహిమా ॥ 2 ॥ **॥ స్వామి॥**
నేనంధుడను నీ దాసుడను - ఒకసారి దర్శనమీయుమా ॥2॥ **॥ స్వామి॥**
ఏమని తెలుపుదు అలసిపోతినని - తులసవ్వ అనేగనుమా ॥2॥ **॥స్వామి॥**

(13)

**కరుణించి బ్రోవరా ఇపుడైనా స్వామి**
**నీవే నా తల్లిదండ్రి తోబుట్టువోయీ ॥కరుణించి॥**
నేనంధుడను నీ సేవకుడను
నేనెరుగలేను (3) నీ మహిమ లీలలు ॥కరుణించి॥
వ్యర్థంబు చేసితి నా వయస్సంతా
చివరకు తోడు (3) ఎవ్వరు రారు ॥కరుణించి॥
వాకిలిని చిమ్మే చీపురు వక్కెమ్మ
వెంకయ్యస్వామి (3) కరుణించవోయీ ॥కరుణించి॥

(14)

**నీకు నైవేద్యమును ఏమర్పించెదను స్వామీ? ॥2॥**
**నీ భక్తుల దాసిని కరుణించుము శ్రీ హరీ ॥2॥**
మృష్టాన్న భోజనం చేసే శ్యామ సుందరా ॥2॥
ఈ దీనురాలి ఈ రొట్టె ముక్కను తినెదవా ॥2॥
నీవు పరీక్షించకు నా సత్యమును భగవంతా! శ్రీకాంతా
మధ్యాహ్నరాత్రి గడిచే నిలువు మా చెంతా తీర్చుకొరతా
ఈ మేలుకొలుపు ఆరతి కాగానే నీకు భక్తులు ॥2॥
ఎన్నెన్నో రకాల నివేదనలను తెత్తురు **॥నీకు నైవేద్యమును॥**

(15)

**శ్రీ సద్గురు వెంకయ్యస్వామి ॥2॥**
**మము రక్షింపగా వేగమే రావోయి ॥2॥**
నే పాపిని - నే పతితుడను ॥2॥
నను ఉద్ధరించవా - స్వామి గురుదేవా ॥2॥
నీవు శాంతి క్షమలకు - నిలయం ॥2॥
సంసార సంద్రమును - దాటించవా గురు ॥2॥
గురుదేవా స్వామి మహదేవా - ఈ పామరుని బ్రోవా
త్వరగ రావేలా - త్వరగ రావేలా
నను కాపాడి తరింపజేయుమా దేవా ॥2॥

**॥ శ్రీ సద్గురు ॥**

**సచ్చిదానంద సద్గురు వెంకయ్యస్వామి మహరాజ్‌కీ జై**
**రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ శ్రీ సచ్చిదానంద సద్గురు**
**భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహరాజ్‌కీ జై**

(మేలుకొలుపు ఆరతి కార్యక్రమము సమాప్తము)

## స్వామి సూక్తి

సంపూర్ణ విశ్వాసంతో ఇక్కడకొచ్చి ఏదనుకుంటే అది అయ్యేదే గదయ్యా

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహారాజ్‌కి జై

# మధ్యాహ్న ఆరతి

(1)

1. చేయుదుమా పంచారతి - శ్రీ స్వామీకి ఆరతి
స్వామికి ఆరతి - శ్రీ వెంకయ్యకు ఆరతి
2. లేలెండు బంధువులారా - లేచెను రమానాథుడు
స్వామి రమానాథుడు - లేచెను రమానాథుడు
3. స్థిరమైన మనస్సుతో - చేయుదుమా ధ్యానమ్
వెంకయ్యస్వామి ధ్యానమ్ - చేయుదుమా ధ్యానమ్
4. కృష్ణనాథా వెంకయ్యస్వామి - మా మదిలో నీవేనోయీ
దత్త వెంకయ్యస్వామి - మా మదిలో నీవేనోయీ

(2)

**ఆరతి వెంకయార్యా - సర్వసృష్టికి దాతా - నీ చరణ ధూళిగను**
**నను చేయుము దేవా - కావుము దేవా ॥ఆరతి॥**

1. కామము దహియించి - స్వామి మము కరుణించి
ముముక్షుకు స్వదృష్టి - నీవు కరుణించు రంగా - కరుణించు రంగా **॥ఆరతి॥**
2. ఏ విధి కొలచెదరో - ఆ రీతిగ ఫలితము
భావము ఏ విధమో-ఆ విధి అనుభవము - విధి అనుభవము ॥ **ఆరతి॥**
3. నీ నామ స్మరణంబు - కలిగించును తృప్తి
నీ లీల పఠనముచే-మాకు దొరుకును ముక్తి - దొరుకును ముక్తి **॥ఆరతి॥**
4. కలియుగమందున - నీవు బ్రహ్మ స్వరూపం
ధరించి వచ్చితివి - స్వామి దత్త దిగంబర - దత్త దిగంబర **॥ ఆరతి॥**
5. ప్రతి శనివారమున - నిను కొలచినవారి
కష్టాలు కడతేర్చి-మము కరుణించు స్వామి - కరుణించు స్వామి **॥ఆరతి॥**
6. నాకున్న సంపదలు - నీ చరణాల సేవకై
అంకితమిచ్చితిని - ఓ దేవాధిదేవా - దేవాధిదేవా **॥ ఆరతి ॥**
7. స్వచ్ఛమైన ఉదకమును - కోరే చాతకపక్షి
కరుణించి బ్రోవుమయా - స్వామి దర్శనమిచ్చి - దర్శనమిచ్చి ॥ **ఆరతి॥**

## (3)

**జయదేవ - జయదేవ దత్తా అవధూత ఓ స్వామి అవధూతా**
**నీ చరణ కమలములపై - శిరస్సుంచి మ్రొక్కితి ॥జయదేవ॥**

1. ధర్మము నశియించే - వేళా జన్మించి
నాస్తికులందరినీ - రమియింప జేసి
ఎన్నెన్నో నీ దివ్య - మహిమలు చూపించి
ఆపదలన్నీ నీవు నశియింపజేసి **॥జయదేవ॥**

2. అవధూత రూపాన - దర్శనము యిచ్చి
మూఢులకు ఓ స్వామి - కనులు తెరిపించి
సోంపల్లి వంశాన నీవు - జన్మంబు ఎత్తి
ద్వైత భావంబను సంశయము విడచి **॥జయదేవ॥**

3. హిందూ ముస్లిముల - భేదం లేదంటివి
మానవ రూపాన - జన్మను పొందితివి
అందరిపై నీ దృష్టి - ఒకటని చాటితివి
అందరు ఒకటేనంటూ - జగతికి తెల్పితివి **॥జయదేవ॥**

4. వెంకయార్య నీకు - కోటి దండాలు
నీ మహిమయే తొలగించు - మా పాపాలు
నీ కృపయే కలిగిన - తొలగు ఆపదలు
శక్తి నీయుము దేవా - చేసేందుకు భజనలు **॥జయదేవ॥**

## (4)

గొలగమూడియే పండరిపురము - స్వామి రమానాథుడు
స్వామి రమానాథుడు - వెంకయ్యస్వామి రమానాథుడు
శుద్ధ భక్తియే చంద్రభాగ - పుండరీకుడు భావం కాగా
పుండరీకుడు భావం కాగా - పుండరీకుడు భావం కాగా
రండి - రండి భక్తులారా - మన స్వామిని మ్రొక్కండి
స్వామిని మ్రొక్కండి - వెంకయ్యస్వామిని మ్రొక్కండి
రోశిరెడ్డి పిలిచే స్వామి - నీవు తొందరగా రావోయీ
తొందరగా రావోయీ - స్వామి తొందరగా రావోయీ

(5)

1. నీ పాద కమలాలకు - ప్రణామమ్ ; నా కన్నులలో- నీ దివ్యరూపమ్
2. ప్రేమతో నిన్ను - ఆనందముగా ; పూజింతుననే - శ్రీ నామదేవా
3. తల్లివి నీవే - తండ్రియు నీవే ; బంధువు నీవే - మిత్రుడవు
4. విద్యయు నీవే - ధనమును నీవే ; సర్వము నీవే - దేవాధిదేవా
5. దేహము చేతా - మాటల చేతా ; యింద్రియములు-మనస్సు చేతా
6. ఆత్మ చేతా - చేసిన పనులు ; నారాయణునికి - అర్పితము
7. అచ్యుతం-కేశవం-రామనారాయణం; కృష్ణ దామోదరం - వాసుదేవం హరిం
8. శ్రీధరం మాధవం - గోపికా వల్లభం ; జానకీ నాయకం - రామచంద్రం భజే

(4)

హరే రామ హరే రామ-రామ రామ హరే హరే॥
హరేకృష్ణ హరేకృష్ణ - కృష్ణ కృష్ణ హరే హరే॥
ఓం నారాయణ - ఆది నారాయణ ॥ 2 ॥
హరి: ఓం గురుదేవ దత్త

(7)

హరి: ఓం యజ్ఞేన యజ్ఞమయజంత దేవస్తాని ధర్మాణి
ప్రథమాన్యాసన్! తేహనాకం మహిమానస్సచంత
యత్రపూర్వే సాధ్యా:స్సంతి దేవా: !
ఓమ్ రాజాధిరాజాయ ప్రసహ్యాసాహినే
నమో వయం వై శ్రవణాయ కుర్మహే
సమే కామాన్ కామ కామాయ మహ్యం
కామేశ్వరో వైశ్రవణో దదాతు!
కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమ:
ఓం స్వస్తి సామ్రాజ్యం భోజ్యం,
స్వారాజ్యం, వైరాజ్యం, పారమేష్ఠ్యం, రాజ్యం
మహారాజ్య మాధిపత్య మయం సమంతపర్యా
ఈస్యా! స్సార్వభౌమ: స్సార్వాయుషాన్!
తదాపరార్థాత్ పృధివ్యై సముద్ర పర్యంతాయ
ఏకరాళ్ళితి తదహ్యేష శ్లోకోఅభిగీతో మరుత:

పరివేష్టారో మరుత్తస్యావసన్ గృహే!
ఆవిక్షితస్య కామప్రేర విశ్వేదేవా: సభాసద ఇతి ॥

**శ్రీ నారాయణ వాసుదేవ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహరాజ్‌కి జై !**

**(8)**

1. అనంతా నిన్నెట్లు - పూజింపవలెనో!
అనంతా నిన్నెట్లు - సేవించవలెనో?
అనంతా నిను పొగడ - శేషునికి రాకా
**నమస్కారం సాష్టాంగ - గొలగమూడివాసా**
2. స్మరియించు కొందురు - నిత్యము నీ నామం
స్థిరముగ నుంచుము మాలో - నీ భక్తిభావం
మాయ మోహాలను - హరియించు దాతా ॥ **నమస్కారం** ॥
3. భక్తులను ఎల్లప్పుడు - కనిపెట్టుకుంటూ
లౌకికులకు అజ్ఞానిగా - కనిపించుకుంటూ
మాలోన తిరిగే - మోక్షప్రదాతా ॥ **నమస్కారం** ॥
4. మానవజన్మంబునే - ధరియించి నీవు
నరులకు సార్థకుడవై - నివసించినావు
అహమిడిచితె స్వామి ప్రేమకు-లేదయ్య కొరతా ॥ **నమస్కారం** ॥
5. జ్ఞానంబు తెలియని - మము చేరదీసి
ముద్దులతో ముంచెత్తి - ధన్యులుగా చేసి
ప్రేమలతో ముద్దులను - కురిపించు దాతా ॥ **నమస్కారం** ॥
6. దేవతలు కొలిచేటి - నీ పాదములకు
శుకాదుల సమానం - నీ పాదములకు
ప్రయాగాది తీర్థాలు - గల పాదములకు ॥ **నమస్కారం** ॥
7. నీ పాదపద్మాలు చూసి గోపికలు
నీ చిత్స్వరూపములో - రమియించినారు
అట్టి క్రీడలు జరిపిన - భాగ్య విధాతా ॥ **నమస్కారం** ॥

8. చిత్తముతో అడిగేను - నే చేతులెత్తి
అత్యంతమైన - భావంబు సల్పి
సంసార సంద్రాన్ని - దాటించు దాతా ॥ **నమస్కారం** ॥

**(9)**

**దేవా! యిటు రావా - స్వామి దిగంబరా**
**అఖండరూపా - సర్వము నీవే వ్యాపించి**
**వేదవిదా! అనసూయాత్రికుమారా ॥ దేవా యిటురావా ॥**

1. కాశిలో స్నానజపం - ప్రతినిత్యం
కొల్హాపురిలో భిక్షం - తుంగభద్ర జలం
త్రాగెదవు - మాహురులో నిదురించె ॥ **దేవా యిటురావా** ॥

2. జోలెను ధరియించి - త్రిశూలము
ఢమరును కూడా ధరించి - నాలుగు విధాలుగా
భక్తులను బ్రోచిన ముక్తిప్రదాతా ॥ **దేవా యిటురావా** ॥

3. నీవు పాదుకలు - జపమాలా
కమండలము - మృగచర్మమును ధరియించితివి
జటలోనా - నాగశేషుడు వెలిగే ॥ **దేవా యిటురావా** ॥

4. నిన్నే ధ్యానించే - ప్రతి గృహము
నిలయము నీకు - లక్ష్మి తాండవ మాడునులే
ఆపదలు - తొలగించి రక్షించె ॥ **దేవా యిటురావా** ॥

5. నిత్యము నీ ధ్యానమ్ - గురుదేవా
నిరతము దర్శన భాగ్యం - దేవా కన్నులకు
నీ నామం - ఆనందమిచ్చే స్వామి ॥ **దేవా యిటురావా** ॥

**(10)**

1. దేవా సత్స్వరూపమ్ - ఆనంద దీపమ్
జగోత్పత్తి స్థితిలయలకు - నీవేరా మూలమ్
భక్తులకై ధరియించి - మానుష్య రూపమ్
**ప్రణామిల్లెదన్ వెంకయ్యస్వామి మహేశమ్**

2. అజ్ఞానం తొలగించే - భాస్కరుని తేజం
ఋషులకు మునులకు - నీవే ధ్యాన గమ్యమ్
నిర్గుణడవు నీవేరా - సృష్టిలో సర్వమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

3. విడిపించి భక్తులకు - సంసార బంధమ్
కలిగింతువయ్యా - నిత్య సంతోషమ్
కలియుగంబున నీవు - ఎత్తితివి జన్మమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
4. ఎల్లప్పుడు వేప - చెట్టు నివాసమ్
ఆ చెట్టు చేదులో - పోసి అమృతమ్
ఆ చెట్టును చేసావు - నీవు కల్పవృక్షమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
5. ఆ కల్పవృక్షంబు - నీడే శరణ్యమ్
అందరికి ఒసగితివి - ఓ దేవా అభయమ్
భుక్తి - ముక్తీ నిచ్చు - ప్రేమావతారమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
6. అనేకమయినా నీ - లీలా విలాసమ్
అహమ్‌లేనీ స్వామి - నీ దివ్య రూపమ్
మహిమలను చూపెట్టె - శ్రీ దత్త రూపమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
7. సత్పురుషులు కొలిచేరు - నీ దివ్య రూపమ్
సాధుసజ్జనులకు - నీవేరా గమ్యమ్
భక్తులను కాపాడె - కళ్యాణ రామమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
8. సాక్షాత్ పరబ్రహ్మ - అవతారమూర్తిమ్
జన్మాది రహితుడు - శ్రీ రామ రూపమ్
మీ దర్శనమ్ నాకు - స్వర్గ సోపానమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥
9. ఓ స్వామీ - కృపాసాగరా అఖిలా - సర్వార్థ సిద్ధిప్రదా
సాటిలేని - మీ పాదధూళిని గూర్చి - బ్రహ్మయైనా కీర్తించలేడు
సద్భక్తితో కరములు జోడించి - నిన్నే శరణంటిని ప్రభో
మీ పాద కమలము తప్ప - ఇలలో వేరే లేడు దైవమ్
10. దత్తరూపుడా - రాఘవోత్తమా
భక్తికార్యములు - నెరవేర్చుమా
ప్రభు మాయచే - వ్యాకులంబైనా
చిత్తశుద్ధికై - ధ్యానించెదను
11. శరచ్చంద్రుని - కిరణ ప్రకాశమ్
దయాసాగర - స్వామి తేజమ్
నిన్నాశ్రయించిన - కలుగును మోక్షమ్
నశియించిపోవును - భక్తులకు తాపమ్

12. ఉపాసనా దైవమా - వెంకయార్య
ఉపాసకుడినైన - నా పూజలనుగొని
తుమ్మెద మకరందము - గ్రోలునట్లు
మా మది మీ పైనా - నిలిచేలా దీవించు

13. అనేక జన్మాల - పాపాల కర్మమ్
నీ దర్శనముచే - హరియించిపోవున్
వెంకయ్యస్వామి - కరుణించవయ్యా
నా తప్పులన్నీ - మన్నించవయ్యా

14. వెంకయ్యస్వామి - చరణామృతముచే
పరిశుద్ధులైనా - భక్తజనావళి
సంసార దోషం - నివారించబడి
పరమపదమునే - పొందగలరు

15. భక్తితో - ఈ స్తోత్రం - ఎవ్వరు పఠించెదరో
తన్మయత్వమును పొంది - స్వామికృపను పొందగలరు

**(11)**

జ్ఞానేంద్రియములతో - కర్మేంద్రియములతో
ఈ నాటి వరకు నే - పలికిన పలుకులు
తెలిసో తెలియకో - చేసిన పనులన్ని
మన్నించి బ్రోవుమా - స్వామి మహాప్రభో

**శ్రీ సచ్చిదానంద సద్గురు వెంకయ్యస్వామి మహరాజ్ కీ జై**

**రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహరాజ్ కీ జై**

(మధ్యాహ్న ఆరతి కార్యక్రమము సమాప్తము)

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహారాజ్‌కి జై

# సాయం సంధ్య ఆరతి

## (1)

**ఆరతి వెంకయార్యా - సర్వసృష్టికి దాతా - నీ చరణ ధూళిగను నను చేయుము దేవా - కావుము దేవా ॥ఆరతి॥**

1. కామము దహియించి - స్వామి మము కరుణించి
ముముక్షుకు స్వదృష్టి - నీవు కరుణించు రంగా - కరుణించు రంగా ॥**ఆరతి**॥
2. ఏ విధి కొలచెదరో - ఆ రీతిగ ఫలితము
భావము ఏ విధమో-ఆ విధి అనుభవము-విధి అనుభవము ॥**ఆరతి**॥
3. నీ నామ స్మరణంబు - కలిగించును తృప్తి
నీ లీల పఠనముచే-మాకు దొరుకును ముక్తి-దొరుకును ముక్తి ॥**ఆరతి**॥
4. కలియుగమందున - నీవు బ్రహ్మ స్వరూపం
ధరించి వచ్చితివి - స్వామి దత్త దిగంబర - దత్త దిగంబర ॥**ఆరతి**॥
5. ప్రతి శనివారమున - నిను కొలచినవారి
కష్టాలు కడతేర్చి- మము కరుణించు స్వామి- కరుణించు స్వామి ॥**ఆరతి**॥
6. నాకున్న సంపదలు - నీ చరణాల సేవకై
అంకితమిచ్చితిని - ఓ దేవాధిదేవా - దేవాధిదేవా ॥**ఆరతి**॥
7. స్వచ్ఛమైన ఉదకమును - కోరే చాతకపక్షి
కరుణించి బ్రోవుమయా - స్వామి దర్శనమిచ్చి - దర్శనమిచ్చి ॥**ఆరతి**॥

## (2)

గొలగమూడియే పండరిపురము - స్వామి రమానాథుడు
స్వామి రమానాథుడు - వెంకయ్యస్వామి రమానాథుడు
శుద్ధ భక్తియే చంద్రభాగ - పుండరీకుడు భావం కాగా
పుండరీకుడు భావం కాగా - పుండరీకుడు భావం కాగా
రండి - రండి భక్తులారా - మన స్వామిని మ్రొక్కండి
స్వామిని మ్రొక్కండి - వెంకయ్యస్వామిని మ్రొక్కండి
రోశిరెడ్డి పిలిచే స్వామి - నీవు తొందరగా రావోయీ
తొందరగా రావోయీ - స్వామి తొందరగా రావోయీ

(3)

1. నీ పాద కమలాలకు - ప్రణామమ్ ; నా కన్నులలో- నీ దివ్యరూపమ్
2. ప్రేమతో నిన్ను - ఆనందముగా ; పూజింతుననే - శ్రీ నామదేవా
3. తల్లివి నీవే - తండ్రియు నీవే ; బంధువు నీవే - మిత్రుడవు
4. విద్యయు నీవే - ధనమును నీవే ; సర్వము నీవే - దేవాధిదేవా
5. దేహము చేతా - మాటల చేతా ; యింద్రియములు-మనస్సు చేతా
6. ఆత్మ చేతా - చేసిన పనులు ; నారాయణునికి - అర్పితము
7. అచ్యుతం-కేశవం-రామనారాయణం; కృష్ణ దామోదరం -వాసుదేవం హరిం
8. శ్రీధరం మాధవం-గోపికా వల్లభం ; జానకీ నాయకం-రామచంద్రం భజే

(4)

హరే రామ హరే రామ-రామ రామ హరే హరే॥
హరేకృష్ణ హరేకృష్ణ - కృష్ణ కృష్ణ హరే హరే॥
ఓం నారాయణ - ఆది నారాయణ ॥ 2 ॥
హరి: ఓం గురుదేవ దత్త

(5)

1. అనంతా నిన్నెట్లు - పూజింపవలెనో!
అనంతా నిన్నెట్లు - సేవించవలెనో?
అనంతా నిను పొగడ - శేషునికి రాకా
**నమస్కారం సాష్టాంగ - గొలగమూడివాసా**

2. స్మరియించు కొందురు - నిత్యము నీ నామం
స్థిరముగ నుంచుము మాలో - నీ భక్తిభావం
మాయ మోహాలను - హరియించు దాతా ॥ **నమస్కారం** ॥

3. భక్తులను ఎల్లప్పుడు - కనిపెట్టుకుంటూ
లౌకికులకు అజ్ఞానిగా - కనిపించుకుంటూ
మాలోన తిరిగే - మోక్షప్రదాతా ॥ **నమస్కారం** ॥

4. మానవజన్మంబునే - ధరియించి నీవు
నరులకు సార్థకుడవై - నివసించినావు
అహమిడిచితె స్వామి ప్రేమకు-లేదయ్యె కొరతా ॥ **నమస్కారం**॥

5. జ్ఞానంబు తెలియని - మము చేరదీసి
ముద్దులతో ముంచెత్తి - ధన్యులుగా చేసి

ప్రేమలతో ముద్దులను - కురిపించు దాతా ॥ **నమస్కారం** ॥

6. దేవతలు కొలిచేటి - నీ పాదములకు
శుకాదుల సమానం - నీ పాదములకు
ప్రయాగాది తీర్థాలు - గల పాదములకు ॥ **నమస్కారం** ॥

7. నీ పాదపద్మాలు చూసి గోపికలు
నీ చిత్స్వరూపములో - రమియించినారు
అట్టి క్రీడలు జరిపిన - భాగ్య విధాతా ॥ **నమస్కారం** ॥

8. చిత్తముతో అడిగేను - నే చేతులెత్తి
అత్యంతమైన - భావంబు సల్పి
సంసార సంద్రాన్ని - దాటించు దాతా ॥ **నమస్కారం** ॥

**(6)**

**దేవా! యిటు రావా - స్వామి దిగంబరా**
**అఖండరూపా - సర్వము నీవే వ్యాపించి**
**వేదవిదా! అనసూయాత్రికుమారా ॥ దేవా యిటురావా॥**

1. కాశిలో స్నానజపం - ప్రతినిత్యం
కొల్హాపురిలో భిక్షం - తుంగభద్ర జలం
త్రాగెదవు - మాహురులో నిదురించె ॥ **దేవా యిటురావా॥**

2. జోలెను ధరియించి - త్రిశూలము
ఢమరును కూడా ధరించి - నాలుగు విధాలుగా
భక్తులను బ్రోచిన ముక్తిప్రదాతా ॥ **దేవా యిటురావా॥**

3. నీవు పాదుకలు - జపమాలా
కమండలము - మృగచర్మమును ధరియించితివి
జటలోనా - నాగశేషుడు వెలిగే ॥**దేవా యిటురావా॥**

4. నిన్నే ధ్యానించే - ప్రతి గృహము
నిలయము నీకు - లక్ష్మీ తాండవ మాడునులే
ఆపదలు - తొలగించి రక్షించె ॥**దేవా యిటురావా॥**

5. నిత్యము నీ ధ్యానమ్ - గురుదేవా
నిరతము దర్శన భాగ్యం - దేవా కన్నులకు
నీ నామం - ఆనందమిచ్చే స్వామి ॥ **దేవా యిటురావా॥**

(7)

1. దేవా సత్స్వరూపమ్ - ఆనంద దీపమ్
జగోత్పత్తి స్థితిలయలకు - నీవేరా మూలమ్
భక్తులకై ధరియించి - మానుష్య రూపమ్
**ప్రణామిల్లెదన్ వెంకయ్యస్వామి మహేశమ్**

2. అజ్ఞానం తొలగించే - భాస్కరుని తేజం
ఋషులకు మునులకు - నీవే ధ్యాన గమ్యమ్
నిర్గుణడవు నీవేరా - సృష్టిలో సర్వమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

3. విడిపించి భక్తులకు - సంసార బంధమ్
కలిగింతువయ్యా - నిత్య సంతోషమ్
కలియుగంబున నీవు - ఎత్తితివి జన్మమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

4. ఎల్లప్పుడు వేప - చెట్టు నివాసమ్
ఆ చెట్టు చేదులో - పోసి అమృతమ్
ఆ చెట్టును చేసావు - నీవు కల్పవృక్షమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

5. ఆ కల్పవృక్షంబు - నీడే శరణ్యమ్
అందరికి ఒసగితివి - ఓ దేవా అభయమ్
భుక్తి - ముక్తీ నిచ్చు - ప్రేమావతారమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

6. అనేకమయినా నీ - లీలా విలాసమ్
అహమ్‌లేనీ స్వామి - నీ దివ్య రూపమ్
మహిమలను చూపెట్టె - శ్రీ దత్త రూపమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

7. సత్పురుషులు కొలిచేరు - నీ దివ్య రూపమ్
సాధుసజ్జనులకు - నీవేరా గమ్యమ్
భక్తులను కాపాడె - కళ్యాణ రామమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

8. సాక్షాత్ పరబ్రహ్మ - అవతారమూర్తిమ్
జన్మాది రహితుడు - శ్రీ రామ రూపమ్
మీ దర్శనమ్ నాకు - స్వర్గ సోపానమ్ ॥ **ప్రణామిల్లెదన్** ॥

9. ఓ స్వామీ - కృపాసాగరా అఖిలా - సర్వార్థ సిద్ధిప్రదా
సాటిలేని - మీ పాదధూళిని గూర్చి - బ్రహ్మయైనా కీర్తించలేడు
సద్భక్తితో కరములు జోడించి - నిన్నే శరణంటిని ప్రభో
మీ పాద కమలము తప్ప - ఇలలో వేరే లేడు దైవమ్

10. దత్తరూపుడా - రాఘవోత్తమా
భక్తికార్యములు - నెరవేర్చుమా
ప్రభు మాయచే - వ్యాకులంబైనా
చిత్తశుద్ధికై - ధ్యానించెదను
11. శరచ్చంద్రుని - కిరణ ప్రకాశమ్
దయాసాగర - స్వామి తేజమ్
నిన్నాశ్రయించిన - కలుగును మోక్షమ్
నశియించిపోవును - భక్తులకు తాపమ్
12. ఉపాసనా దైవమా - వెంకయార్య
ఉపాసకుడినైన - నా పూజలనుగొని
తుమ్మెద మకరందము - గ్రోలునట్లు
మా మది మీ పైనా - నిలిచేలా దీవించు
13. అనేక జన్మాల - పాపాల కర్మమ్
నీ దర్శనముచే - హరియించిపోవున్
వెంకయ్యస్వామి - కరుణించవయ్యా
నా తప్పులన్నీ - మన్నించవయ్యా
14. వెంకయ్యస్వామి - చరణామృతముచే
పరిశుద్ధులైనా - భక్తజనావళి
సంసార దోషం - నివారించబడి
పరమపదమునే - పొందగలరు
15. భక్తితో - ఈ స్తోత్రం - ఎవ్వరు పఠించెదరో
తన్మయత్వమును పొంది - స్వామికృపను పొందగలరు

**(8)**

1. నను తల్లి విడిచిన - నను తండ్రి విడిచిన నే ఓర్చుకొందును
నా భార్యా పిల్లలు విడిచినగాని నే ఓర్చుకొందును
నా అత్తమామలు బంధువులిడిచిన నే ఓర్చుకొందును
**ఓ దత్త గురు స్వామి నీవే అలిగిన నే బ్రతుకలేను**
2. నా మేనకోడలు నా వదిన మరియు ప్రియబాంధవులు
ప్రియస్వజనులు మిత్రులు సఖులు నా గూర్చివారు

ఆలోచించకపోయినగాని నే ఓర్చుకొందును **॥ఓ దత్త గురు ॥**
ఓ దత్త గురు స్వామి నీవే అలిగిన నే బ్రతుకలేను

3. స్త్రీలు యువకులు పిన్నలు పెద్దలు తరుణులు వృద్ధులు
మంచివారును మరి చెడువారు సాధువు సజ్జనులు
నున్న గురించి అడుగకపోయినా నే ఓర్చుకొందును **॥ఓ దత్త గురు॥**
ఓ దత్త గురు స్వామి నీవే అలిగిన నే బ్రతుకలేను

4. నను తత్వవేత్తలు మరి పండితులు జ్ఞానులు రాజులు
విదుషీమణులు మరి బుద్ధిమంతులు సన్యాసులందరు
తపస్వులందరు నను కోపగించిన నే ఓర్చుకొందును **॥ఓ దత్తగురు॥**

5. కవికోదులు సిద్ధులు యోగులు మరి నిష్పాపులు
గృహ గ్రామదేవులు కులదేవులు మరి దుష్టపిశాచాలు
భూతాలు ఢాకినులు అలిగిన నే ఓర్చుకొందును **॥ఓ దత్త గురు॥**

6. పశువులు పక్షులు పురుగులు సర్వజీవ జంతువులు
వృక్షములు మరి పాషాణములు నది పర్వతాలు
పంచభూతములు అలిగిన గాని నే ఓర్చుకొందును **॥ఓ దత్త గురు॥**

7. చంద్రుడు సూర్యుడు నవగ్రహములు మరి యక్షకిన్నరులు
ఆకాశమందలి నక్షత్రములు మరి దేవేంద్రుడు
యమధర్మరాజు నాపై అలిగిన నే ఓర్చుకొందును **॥ ఓ దత్త గురు॥**

8. నా మనస్సు వాక్కు చపలచిత్తము మరియు శరీరము
కాలము మరియు సర్వదిక్కులు సర్వజగత్తు
త్రిభువనములు నాపై అలిగినగాని నే ఓర్చుకొందును **॥ఓ దత్తగురు॥**

9. మదమత్సరమను సర్పంబు నన్ను కాటువేసినను
గురుదేవులను పూజించె రుచి ఎల్లప్పుడుండవలె
ప్రపంచ విషయములు మరిచిపోయి దృఢమైన భక్తీ
నా హృదయములో నింపుము దేవా అని వేడుకొంటిని

10. ద్వేషము కోరిక నశియించునట్లుగా చేయుము దేవా
స్వామి రూపము నా మదిలో నిలుపును దేవా
జగమంతా నీవే నా పైన ప్రేమ కలిగించు దేవా
నే కోరే భిక్షను అనుగ్రహించి బ్రోవుము దేవా

**(11)**

హరి: ఓం యజ్ఞేన యజ్ఞమయజంత దేవస్తాని ధర్మాణి
ప్రథమాన్యాసన్! తేహనాకం మహిమానస్సచంత
యత్రపూర్వే సాధ్యా:స్సంతి దేవా: !
ఓమ్ రాజాధిరాజాయ ప్రసహ్యసాహినే
నమో వయం వై శ్రవణాయ కుర్మహే
సమే కామాన్ కామ కామాయ మహ్యం
కామేశ్వరో వైశ్రవణో దదాతు!
కుబేరాయ వైశ్రవణాయ మహారాజాయ నమ:
ఓం స్వస్తి సామ్రాజ్యం భోజ్యం,
స్వారాజ్యం, వైరాజ్యం, పారమేష్ఠ్యం, రాజ్యం
మహారాజ్య మాధిపత్య మయం సమంతపర్యా
ఈస్యా! స్సార్వభౌమ: స్సార్వాయుషాన్!
తదాపరార్థాత్ పృధివ్యై సముద్ర పర్యంతాయ
ఏకరాళ్ళితి తదహ్యేష శ్లోకోఅభిగీతో మరుత:
పరివేష్ఠారో మరుత్తస్యావసన్ గృహే!
ఆవిక్షితస్య కామప్రేర విశ్వేదేవా: సభాసద ఇతి ॥

**శ్రీ నారాయణ వాసుదేవ సచ్చిదానంద సద్గురు శ్రీ**
**వెంకయ్యస్వామి మహరాజ్‌కి జై !**

**(12)**

జ్ఞానేంద్రియములతో - కర్మేంద్రియములతో
ఈ నాటి వరకు నే - పలికిన పలుకులు
తెలిసో తెలియకో - చేసిన పనులన్ని
మన్నించి బ్రోవుమా - స్వామి మహాప్రభో

**శ్రీ సచ్చిదానంద సద్గురు వెంకయ్యస్వామి మహరాజ్ కీ జై**
**రాజాధిరాజ యోగిరాజ పరబ్రహ్మ శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్**
**శ్రీ వెంకయ్యస్వామి మహరాజ్ కీ జై**

(సాయం సంధ్య ఆరతి కార్యక్రమము సమాప్తము)

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి మహారాజ్‌కి జై

# పవళింపు ఆరతి

## (1)

**పవళింపు ఆరతి నీకు - గొలగమూడివాసా ఓ దత్తా అవధూత**
**- పంచతత్వ దీపములనే - వెలిగించెదమయ్యా**

1. నిరాకారా స్వామి నీకు - ఆకారమొచ్చె - స్వామి ఆకారమొచ్చె
   సర్వదిశలకు స్వామి దివ్య - వెలుగు వ్యాపించె ॥**పవళింపు**॥
2. రాజస సాత్విక తమో గుణాలచే-మాయా జనియించె-స్వామి మాయా జనియించె
   ఆ మాయ నుండి ద్వితీయ మాయా -ఎట్లు ఉదయించె ॥**పవళింపు**॥
3. సప్త సాగర మైదానములో - ఆటలు ఆడితివి - స్వామి ఆటలు ఆడితివి
   ఆటలు ఆడి సంపూర్ణముగా - లీలలు చూపితివి ॥**పవళింపు**॥
4. బ్రహ్మాండములను కనులకు చూపిన-దీన దయాళుడు-స్వామి పరమ దయాళుడు
   అమాయకుడనే - ఆత్మీయుడనే - తుకారాముడు ॥**పవళింపు**॥

## (2)

జగమున జ్ఞానంబు - ఆయేను శూన్యంబు
పాండురంగ అవతారం - స్వామి నీ జన్మంబు
**ఆరతి జ్ఞానరాజా - స్వామి మంగళతేజా**
**సాధు సజ్జనులు - కొలిచిరి జగమంతా ॥ ఆరతి జ్ఞానరాజా॥**
ఆరతి వెలిగించి నిలిచిరి గోపికలు
పాడిరి నామమును - నారద తుంబురులు ॥ **ఆరతి జ్ఞానరాజా**॥
జగతికి చూపితివి - నీవు బ్రహ్మ స్వరూపం
రామ జనార్ధనా - సాష్టాంగ ప్రణామమ్ ॥ **ఆరతి జ్ఞానరాజా**॥

## (3)

**ఆరతి తుకారామా - స్వామి సద్గురుధామా**
**సచ్చిదానందమూర్తీ-మాపై చూపుమా కరుణా ॥ఆరతి తుకారామా॥**
రాముడు సంద్రములో - రాళ్ళను ఉద్ధరించే
ఆ విధి తుకొబాది - గ్రంథమును రక్షించె ॥**ఆరతి తుకారామా**॥

నీ మహిమలను విని - బ్రహ్మరూపుడ నీవని
నీకు రామేశ్వరుడు - పాదపూజలు చేసెను **॥ఆరతి తుకారామా॥**

**(4)**

**జై జై వెంకయార్య నీవు - కోవెలలో నిదురించుము**
**ప్రేమా భక్తితో భక్తులందరము - జోల పాటలు పాడెదము ॥జై జై॥**

1. తల్లీ బిడ్డను పెంచిన విధముగా భక్తులను పోషించితివి ॥ 2 ॥
వ్యాధులను, పోగొట్టి స్వామి - దు:ఖమును తొలగించితివి ॥ 2 ॥
ఆపదలన్నీ నిర్మూలించి - దర్శనమిచ్చి బ్రోచితివి ॥ 2॥
అందుకే నీవు అలసిపోతివి - ఇక విశ్రాంతి గైకొనుమా **॥ జై జై ॥**

2. క్షమా అనే సుందరపానుపుపై - పుష్పంబులనే పరచితిమి ॥ 2 ॥
ప్రేమా భక్తితో చిత్తశుద్ధితో - పూజలను మేము చేసితిమి ॥2 ॥
పంచప్రాణా ఆరతినిచ్చి - సుబుద్ధిజ్యోతి వెలిగించి ॥ 2 ॥
అత్తరు పరిమళ గంధమును - భక్తితో చల్లిరి గైకొనుమా **॥ జై జై ॥**

3. నీ చరణాలు విడిచి వెళ్ళుటకు - ఎంతో దు:ఖము కలిగెనయా ॥ 2 ॥
ఆజ్ఞనిచ్చిన ఆశీర్వాదము - గైకొని ఇంటికి పోదుమయా ॥ 2 ॥
మా మనసులను నీ చరణములపై - నిలిపిన శాంతి కలుగునయా ॥2॥
తెల్లవారగానే నిద్దురలేచి - మాకు హితమును నేర్పుమయా **॥ జై జై ॥**

**(5)**

1. వెంకయ్యస్వామి సుఖముగ నీవు -నిద్దురపోవయ్యా - స్వామి నిద్దురపోవయ్యా
చిన్మయరూపా-ఏకాంతముగా-విశ్రాంతి గొనుమయ్యా ॥ **వెంకయ్యస్వామి**॥
2. వైరాగ్యంబు కల్గిన కుంచెతో స్థలమును తుడిచితిమి- స్వామి స్థలమును తుడిచితిమి
దానిపైన కరుణారసముల జలమును చల్లితిమి ॥ **వెంకయ్యస్వామి** ॥
3. నీ పానుపునకు మెట్లుగా చేసితి -నవవిధుల భక్తి-స్వామి నవవిధుల భక్తి
జ్ఞానమనే సెమ్మెలలోనా - వెలిగించితి జ్యోతి ॥ **వెంకయ్యస్వామి** ॥
4. భక్తీభావన హృదయపు మనస్సు పువ్వులుగా చేసీ -స్వామి పువ్వులుగా చేసీ
నీ పానుపును ఆనందముగా -అలంకరించితిని ॥ **వెంకయ్యస్వామి** ॥
5. ద్వైతము నిండిన హృదయ కవాటము-మూసి వేసితిని-స్వామి మూసి వేసితిని
దుర్బుద్ధియను ముడులను విప్పి - తెరను దించితిని ॥**వెంకయ్యస్వామి**॥

6. ఆశామోహ కల్పనలను వదలివేసితిని - స్వామి వదలివేసితిని
దయా క్షమా శాంతి కోరి - నీ దరి చేరితిని ॥ వెంకయ్యస్వామి ॥
7. అలక్ష్యమైనా సుఖమును పట్టు పానుపు చేసితి - స్వామి పానుపు చేసితి
నిరంజన సద్గురు స్వామి - పవళింపజేసి ॥ వెంకయ్యస్వామి ॥

**(6)**

విఠలా ప్రసాదము - లభించెనయ్యా
విచారించగా మీ శ్రమ - తెలుసుకొంటిమయా
చల్లని స్వామీ - సుఖముగ నిద్దురపోరా గోపాలా
సద్గురు స్వామి దయాళా
మా గృహాలకు పోవుటకు - ఆయేను వేళా
కష్టాలన్ని తెలుపుటకై - మరలా లేపెదము, స్వామీ మరలా లేపెదము
మీకు తెలిపిన దోషాలన్ని - హరించిపోవును ॥ చల్లని స్వామి ॥
అందరిలోనా నీవు కూడా - ఒకరని తలచితిని, స్వామీ ఒకరని తలచితిని
అందుకే ఉత్తమ భోజనమును - నివేదించితిని ॥ చల్లని స్వామి ॥

**శ్రీ సచ్చిదానంద సద్గురు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి**
**మహరాజ్‌కీ జై**

(పవళింపు ఆరతి సమాప్తము)

## సూక్తి

**క్షణ క్షణము ఆత్మవికాసానికై కృషిచేయడం ఒక్కటే జీవిత లక్ష్యం కావాలి**
**– పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మాష్టర్ గారు**